

తిరుపతి అర్బన్ తహసీల్దారు కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద నిర్మాణంలో ఉన్న ఆలయ రాజగోపురం

ఐదు సెంట్లు హాంఫట్

తిరుపతి ఆలిండియా రేడియో కార్యాలయం వెనుకవైపు ఒకే ఆవరణలో తిరుపతి అర్బన్, రూరల్ మండలాల తహసీల్దారు కార్యాలయాలున్నాయి. వాటికి చుట్టూ ప్రహరీ కూడా ఉంది. ఆ కార్యాలయాలకు చుట్టూ అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములున్నాయి. పలు శాఖల కార్యాలయాలున్నాయి. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో వాయువ్య మూల పదేళ్ల కిందట వెంకటేశ్వరస్వామి ఆలయం పేరిట చిన్న మందిరం నిర్మించారు. చూస్తుండగానే ఆ మందిరానికి చుట్టూ ప్రహరీ ఏర్పడింది. ఆపై ధ్వజస్తంభం, తర్వాత బలిపీఠం.. ఇలా అంతకంతకూ మందిరం ఆలయంగా ఆవిర్భవించింది. ఆవరణలో ఒక మూలకు పరిమితమైన మందిరం కాస్తా ఇపుడు ఆవరణ మొత్తాన్నీ ఆక్రమించేసింది. తహసీల్దారు కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూర్చునేందుకు ఆవరణలో వేపచెట్టు, దానిచుట్టూ అరుగు ఉండగా ఆలయానికి అడ్డుగా ఉందని చెట్టును నరికివేయించి, అరుగు కూడా తొలగించేశారు. తాజాగా రాజగోపురం కూడా నిర్మించారు. రెండు సెంట్లలో ఉన్న మందిరం ఇప్పుడు ఐదు సెంట్లకు విస్తరించింది. కార్యాలయానికి జనం రాకపోకలను కూడా అసౌకర్యంగా మార్చేశారు. ఇదంతా ఆవరణలో సంగతి.



అర్బన్ తహసీల్దారు కార్యాలయానికి పడమరగా రోడ్డు పక్కన నిర్మించిన స్టోర్ రూమ్

తిరుపతిలో రెవెన్యూ దేవస్థానం

అది ప్రభుత్వ కార్యాలయ ఆవరణ. ఒక మూలన చిన్న మందిరం రేకుల షెడ్డులో వెలిసింది. పనులపై వచ్చీపోయేవాళ్లు దణ్ణం పెట్టుకుంటారులే అనుకున్నారు. నిదానంగా అది ఆలయంగా మారిపోయింది. గుడి, గోపురం, ప్రాకారం, వాహన మండపం.. ఇలా ఐదు సెంట్ల ప్రభుత్వ భూమిలో అన్ని హంగులూ ఏర్పడ్డాయి. అంతటితో ఆగకుండా రోడ్డునూ, ప్రాకారం బయట ప్రాంతాన్నీ కూడా ఆక్రమించేస్తున్నారు. ఆలయం పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆఫీసులో ఇదేమిటని అడిగేవాళ్లు మాత్రం లేకపోవడమే విచిత్రం.

- ఆ పేరుతో ఖరీదైన ప్రభుత్వ భూముల ఆక్రమణ
- దారులు కూడా మూసేసి ఇష్టారాజ్యంగా నిర్వహణ
- ఆలయ నిర్వహణకు చందాల వసూలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అర్బన్ తహసీల్దారు కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద ఆలయం

తిరుపతి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండల తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఓ చిన్నపాటి మందిరంగా నిర్మితమైన వెంకటేశ్వరస్వామి దేవాలయం పేరిట చుట్టుపక్కల ఖరీదైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. తొమ్మిదేళ్ల వ్యవధిలో కార్యాలయ ఆవరణ మొత్తాన్నీ ఆక్రమించేసిన నిర్వాహకులు ఆపై ప్రహరీ దాటి వెలుపల కూడా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తహసీల్దారు కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలకు వెళ్లే దారులు సైతం మూసేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆలయం పేరిట వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలో బహిరంగంగా ఈ తంతు జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విచిత్రం.

అనుమతి లేకున్నా..

తిరుపతి అర్బన్ తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నిర్మితమై అంతకంతకూ విస్తరిస్తున్న ఆలయానికి ప్రభుత్వ పరంగా ఎలాంటి అనుమతులూ లేవు.అయితే ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరయ్యాయనే ఆరోపణలున్నాయి. రెవెన్యూ సంబంధిత పనులపై వచ్చే వారి నుంచి ఆలయం పేరు చెప్పి వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

ఖరీదైన భూముల ఆక్రమణ

తహసీల్దారు కార్యాలయానికి వెలుపల ఉత్తర, పడమర దిశల్లో రోడ్లు, వాటిని ఆనుకునే అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములున్నాయి. కార్యాలయం ముందు ఉత్తర దిశగా ఉన్న రోడ్డుకు శాశ్వతంగా రేకులతో పందిళ్లు వేసేశారు. రోడ్డుకు ఉత్తరంగా ఖాళీ స్థలంలో వాహన మండపం ప్రత్యక్షమైంది. పడమర ఖాళీ స్థలంలో కూడా వాహనాలు భద్రపరిచేందుకు, ఇతర వస్తువులు ఉంచేందుకు స్టోర్ రూమ్ వెలిశాయి. ఉత్తరంగా ఉన్న రోడ్డు ఎయిర్ బైపాస్ రోడ్డు నుంచీ తహసీల్దారు కార్యాలయం మీదుగా జిల్లా గ్రంథాలయ సంస్థ, జీఎస్టీ, డీఆర్‌డీఏ తదితర కార్యాలయాలతో పాటు జిల్లా పోలీసు కార్యాలయానికి వెళుతుంది. ఉత్సవాల పేరిట తరచూ తహసీల్దారు కార్యాలయం వద్ద ఈ రోడ్డును మూసివేసి డైవర్ట్ చేస్తున్నారు. పడమర వైపు రోడ్డు యూత్ హాస్టల్, డ్వామా కార్యాలయాలతోపాటు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌కు వెళుతుంది. 40 అడుగుల ఈ రోడ్డును సగం ఆక్రమించేశారు. ఉత్సవాల పేరిట ఆ రోడ్డును కూడా రోజుల తరబడీ మూసేస్తున్నారు. దీనిపై యూత్ హాస్టల్ అధికారులు పలుమార్లు అభ్యంతరం తెలిపినా ఉపయోగం లేకుండాపోయింది. దీంతో వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఢిల్లీ టూ తిరుపతి

- రూ.8 కోట్ల విలువైన 10 టన్నుల ఎర్రచందనం స్వాధీనం
- ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు
- ప్రధాన నిందితుడి కోసం గాలింపు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసుల ఆపరేషన్ సక్సెస్ అయింది. ఢిల్లీ గోడౌన్లలో దాచి ఉంచిన దాదాపు రూ.8 కోట్ల విలువైన 10 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకుని, తిరుపతికి తీసుకొచ్చారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను పట్టుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు శనివారం వెల్లడించిన వివరాల మేరకు.. హైదరాబాదు హకీంపేటలో కాపురముంటున్న మధ్యప్రదేశ్‌కు చెందిన మొహమ్మద్ ఇర్ఫాన్, మహారాష్ట్ర కరాడ్ తహసీల్‌కు చెందిన అమిత్ సంపత్ పవార్ ఎర్రచందనాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఇటీవల కడప జిల్లా ఖాజీపేట మండలం పత్తూరు ప్రాంతంలో తమిళనాడుకు చెందిన రాజ్‌కుమార్‌ను పట్టుకుని విచారించారు. శేషాచలం అడవుల నుంచి తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు ఎర్రచందనాన్ని కొల్లగొట్టి ఢిల్లీలోని గోడౌన్లలో దాదాపు 10 టన్నులు దాచి ఉంచినట్లు బయటపెట్టాడు. ఈ నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాదర్ బాషా, సిబ్బంది ఢిల్లీ పోలీసులు, ఫారెస్టు అధికారుల సహకారంతో సౌత్ ఈస్ట్ ఢిల్లీ తుఘ్లకాబాద్ ప్రాంతంలో రెండు రోజుల పాటు తనిఖీలు చేశారు. ఈనెల 6న ఎర్రచందనం అంతర్రాష్ట్ర స్మగ్లర్ మొహమ్మద్ ఇర్ఫాన్‌ను అరెస్టు చేశారు. అతను ఇచ్చిన సమాచారం ఆధారంగా తుఘ్లకాబాద్, కుయన్ మొహల్లా ప్రాంతంలోని గోడౌన్ నెంబరు 366పై దాడి చేసి 10 టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు అమిత్ సంపత్ పవార్‌ను అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులను ఢిల్లీ కోర్టులో హాజరుపరచి ట్రాన్సిట్ వారెంట్‌పై తిరుపతికి తీసుకొచ్చారు. ఈ కేసులో ప్రధాన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. నిందితులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ శ్రీనివాస్ చెప్పారు.



ఢిల్లీ నుంచి తిరుపతికి తీసుకొచ్చిన ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

సిబ్బందికి అభినందనలు

ఢిల్లీ గోడౌన్‌లో అక్రమంగా దాచి ఉంచిన 10 టన్నుల ఎర్రచందనాన్ని పట్టుకోవడంలో కృషి చేసిన టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, షరీఫ్, సీఐలు షేక్ ఖాదర్‌బాషా, ఎస్‌ఐ రఫీ, ఆర్‌ఎస్‌ఐ మురళీధరరెడ్డి, కానిస్టేబుళ్లు వంశీకృష్ణ, షేక్‌బిలాల్, చిన్నికృష్ణయ్యలను టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు, ఫారెస్టు అధికారి సెల్వం అభినందించారు.

నేలపట్టులో విదేశీ పక్షుల దినోత్సవం

దొరవారిసత్రం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శనివారం విదేశీ పక్షుల దినోత్సవం నిర్వహించారు. దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థులకు విదేశీ పక్షుల విడిదిపై నేలపట్టు ఎఫ్‌ఆర్‌వో సౌజన్య అవగాహన కల్పించారు. పక్షుల వల్ల ఈ ప్రాంతం ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందడం, అవి రైతాంగానికి చేసే మేలు గురించి వివరించారు. పక్షుల జీవన విధానంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. శ్రీసిటీలో పనిచేసే నలుగురు జర్మనీ దేశస్థులు పక్షుల కేంద్రాన్ని పరిశీలించారు. పక్షుల విడిది ఇంకా మొదలు కాలేదని, ఈ వారంలో వచ్చే అవకాశాలున్నాయని వన్యప్రాణి సంరక్షణశాఖ అధికారులు వారికి తెలియజేశారు. కంపెనీ ఆవరణలో నాటాలని ఎఫ్‌ఆర్‌వో వారికి జమ్మి చెట్టు మొక్కలను అందజేశారు.



జర్మనీ పర్యాటకుడికి మొక్క అందజేస్తున్న ఎఫ్‌ఆర్‌వో సౌజన్య

ఎన్టీఆర్ వైద్యసేవలకు ఢోకా లేదు

తిరుపతి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో ఎన్టీఆర్ వైద్యసేవలను నిలిపివేయాలని హాస్పిటల్స్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం జిల్లాపై పెద్దగా ప్రభావం కనిపించలేదు. జిల్లా వ్యాప్తంగా 38 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉంటే కేవలం 4 ఆస్పత్రుల్లో మాత్రమే ఓపీ సేవలు నిలిచాయి. వీటిల్లోనూ అత్యవసర వైద్యసేవలకు ఎక్కడా ఆటంకం జరగలేదని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని సంకల్ప, రష్ ఆస్పత్రులతోపాటు గూడూరులోని సీఆర్ రెడ్డి, మైథిలి ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేశారన్నారు. తొలుత వాసన్ ఐకేఆర్ ఆస్పత్రి కూడా వైద్యసేవలు నిలిపివేసి, శనివారం కొనసాగించిందన్నారు.

పంచాయతీల్లో పదోన్నతుల జాతర

- గ్రేడ్ 1 కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా ప్రమోషన్
- ఇతర జిల్లాల నుంచి ఏడుగురి రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగులకు రా ష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా గాజులమండ్యంలో పనిచేస్తున్న గిరిధర్, ఆర్సీపురం మండలం పీవీపురంలో పనిచేస్తున్న షణ్ముగంకు, నారాయణవనంలో పనిచేస్తున్న సీపీ షణ్ముగంకు డిప్యూటీ ఎంపీడీవోలు(ఈవోపీఆర్డీ)గా పదోన్నతి లభించింది.అలాగే బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి ఏడుగురు డిప్యూటీ ఎంపీడీవోలను తిరుపతి జిల్లాకు కేటాయించారు. త్వరలో వీరిని ఖాళీగా ఉన్న మండలాలకు కేటాయించనున్నట్లు డీపీవో సుశీలాదేవి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 14 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకేసారి పది పోస్టులు భర్తీ కానున్నాయి.

ఎస్బీలో బదిలీలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళన దిశగా ఎస్పీ సుబ్బరాయుడు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఏళ్ల తరబడి తిష్టవేసిన ఏడుగురిని అలిపిరి, ఎమ్మార్‌పల్లె, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట పోలీసు స్టేషన్లకు బదిలీ చేశారు. అలాగే శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న చెంచురామయ్యను తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు, అలిపిరిలో పనిచేస్తున్న కుమారస్వామిని తిరుమల ఎస్బీకి బదిలీ చేశారు. అలాగే తిరుపతి ఎస్పీ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న జాకీర్‌హుస్సేన్, షణ్ముగం, ప్రశాంత్‌కుమార్, హరిప్రసాద్‌లను వారు పనిచేస్తున్న పోలీస్ స్టేషన్లకు పంపించేశారు.

SUNDAY SPECIAL

నేనున్నానని..

అసహాయులకు బాసటగా 'ప్రేరణ' సేవాసంస్థ

8



అంబేడ్కర్ విగ్రహంతోనా రాజకీయం?

- కులాల మధ్య చిచ్చు పెడతామంటే ఊరుకోం
- వైసీపీ నాయకులపై హోంమంత్రి అనిత ఫైర్



దేవళంపేట సభలో ప్రసంగిస్తున్న హోంమంత్రి అనిత

వెదురుకుప్పం/పెనుమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళతుండడం చూసి ఓర్వలేక జగన్ అండ్ బ్యాచ్ కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు.వెదురుకుప్పం మండలం దేవళంపేటలో రెండు వారాల క్రితం అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ,దాన్ని టీడీపీ పైకి నెట్టేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించిన వైసీపీ నాయకుల కుట్రను పోలీసులు ఛేదించిన విషయం తెలిసిందే.వైసీపీకి చెందిన సర్పంచ్‌ను ఈ కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టు చేసి జైలుకు పంపించారు.మరోవైపు అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన రోజు సాయంత్రమే ఎమ్మెల్యేలు థామస్, మురళీమోహన్ అక్కడ కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో శనివారం హోంమంత్రి అనిత దేవళంపేటకు వచ్చారు. జోరు వాన కురుస్తున్నా చిత్తూరు ఎంపీ, పలువురు ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.అక్కడే ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని సమాచారం రాగానే పోలీసులకు ఫోన్ చేసి వెంటనే దోషులను గుర్తించి వాళ్లు ఎవరైనా చర్యలు తీసుకోవాలని సూచించానన్నారు.చివరకు వైసీపీ నేతల కుట్ర అని తెలియడంతో ఆశ్చర్యపోయానన్నారు.డిప్యూటీ సీఎంగా పని చేసిన నారాయణస్వామి తమ దండుపాళ్యం బ్యాచ్‌తో వచ్చి టీడీపీ నేతలను అరెస్టు చేయాలని పోలీసులను కోరడంపై ఆమె మండిపడ్డారు.ఆయనకు వయసు పెరిగింది కానీ, బుద్ధి పెరగలేదని ధ్వజమెత్తారు.ధర్నాలు చేయడం, రెచ్చగొట్టడం, తగలబెట్టడం.... తీరా దొరికాక తమకేమీ తెలియదంటూ బుకాయించడం వైసీపీ నైజం అన్నారు.ఎక్కడైనా ఏవైనా జరగరాని సంఘటనలు జరిగినప్పుడు ఎలా జరిగింది, ఎవరు చేశారు అని నిర్ధారించుకున్నాకే కార్యాచరణకు దిగాలని దళిత సంఘాలకు ఆమె సూచించారు.అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి రాష్ట్ర సమస్యగా చేయాలనుకున్న వైసీపీ కుట్రను భగ్నం చేసి నిజానిజాలను ప్రజలకు తెలియజేసిన చిత్తూరు పోలీసులను హోంమంత్రి అభినందించారు.'చిత్తూరులో గ్యాంగ్ రేప్ జరిగితే, ఆ నిందితుల్ని వెంటనే పట్టుకుని ముసుగు వేసి తీసుకెళ్లలేదు. బేడీలు వేసి నడిరోడ్డుపై నడిపించుకుంటూ వెళ్లారు' అంటూ ఆమె పోలీసులకు కితాబునిచ్చారు.రాజకీయ ముసుగులో వున్న నేరస్తులను గుర్తించి కటకటాల వెనక్కు పంపాలని సూచించారు.జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ దళితుల ఓట్లతో గెలిచి డిప్యూటీ సీఎం దాకా ఎదిగిన నారాయణస్వామి తన చర్మం ఒలిచి చెప్పులు కుట్టిస్తానంటూ దళిత ఆత్మగౌరవాన్ని జగన్ కాళ్ల దగ్గర పెట్టిన ద్రోహి అంటూ మండిపడ్డారు.ఎక్సైజ్ మంత్రిగా ఇష్టానికి దోచుకుని కుమార్తెలకు పంచిపెట్టిన ఆయన దళితులతో రాజకీయం చేయాలని చూస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.వాళ్లు ఒక్క విగ్రహాన్ని కాల్చితే తాము వెయ్యి విగ్రహాల్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అండగా దళితులున్నారని గ్రహించిన వైసీపీ నేతలు ఎస్సీ నియోజకవర్గాలను టార్గెట్ చేస్తూ దుష్టపన్నాగాలు మొదలుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక్కడ కాలిన మంట మరో చోటకు వ్యాపించకుండా ఉండాలంటే దోషులను శిక్షించడం మాత్రమే కాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, అందు కోసమే హోం మంత్రి దేవళంపేటకు వచ్చారన్నారు.మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ అన్ని జాతులవారూ కలిసి మొక్కాల్సిన దేవుడు అంబేడ్కర్‌ను కూడా నీచ రాజకీయాలకు వాడుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు.సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, మాజీ ఎమ్మెల్యే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

TIRUPATI URBAN DEVELOPMENT AUTHORITY, TIRUPATI

Roc.No.337/G1/2023 Date: 10-10-2025

NOTIFICATION

Publication of Paper Notification calling for objections and suggestions regarding proposed revised RDPs of the following roads:

1.Existing road to be widened to 30 mts (100 feet) Road as per sanctioned Master Plan from Cherlopalli Junction to Srinivasa mangapuram Junction, Tirupati Rural Mandal in Sy No.s 336/2, 335, 334, 307, 306, 305, 410, 412& 413/2, 412 & 413/1B, 411, 420, 421, 535, 536, 537, 538, 539, 540, 541 & 542/1, 2, 3, 173, 171&172/1, 178/1,5, 177, 169& 176, 188, 194, 195/1,2, 205, 206, 207/1,3, 208, 227, 226/1. 415 to 418/1, 2,3,4, 301, 303, 309, 315/1,3,4, 322, 323/1, , 324/1, 2, 3, 328/1,3,4, 329, 332, 331 of Pudipatla Village and Sy.No. 4/1,2,3,8, 5/2,3,7, 7/4,5,9, 8/6,7,8,10,11,12,13,14, 18/1, 17/1, 2, 3, 16/1, 15/1, 14/1,2, 13/1,2,3 of Kaluru Village vide RDP No. RDP2023/TUDA/PUDI/00004/REV.

2.Proposed 60 ft wide road from Karakambadi Road at Sy.No. 15 of Mangalam Village connecting to proposed 24m Master Plan Road at Sy.no.57 of Mangalam Village, Tirupati Urban Mandal passing through Sy.Nos 15, 18, 20, 21, 22, 40, 41, 42, 43, 57 of Mangalam Village, Tirupati (U), Tirupati District with RDP No. RDP 2023/TUDA/MGL/ 00003/REV.

3.Existing 80 feet Road proposed to be widened to 150 feet from Karakambadi Road Opp RTO Office in Sy.No. 20, 23, 27, 26, 25, 36, 37, 65, 66, 69, 64, 60, 70, 71, 76, 120, 121, 78, 116, 118, 106, 107, 105, 112, 110, 108, 109 connecting to 100' proposed Master Plan Road at Railway Boundary at Sy.No. 100 & 101 vide RDP No. RDP2023/TUDA /MGLM/00005/REV & RDP No.RDP2023/TUDA/MGLM/00002/REV.

4.Proposed 80 feet Road under first phase in 150 feet proposed Master Plan road from Cherlopalli Junction to 200 feet NH-205 (P-N Road) at Peruru (Near Vakulamatha Temple) passing through Sy.No. 203(P), 201&202(P), 200 (P), 135&136(P), 137&138(P), 133&134(P), 132(P), 130(P), 129(P), 128 (P), 124&125(P), 120to122(P), 123(P), 114 (P), 112(P), 106&107(P), 105(P), 96&97(P), 99&100(P), 101&104(P), 12(P), 23(P), 29(P), 30(P), 31&32(P), 4(P), 3(P) of Cherlopalli Village and 310(P), 312&313(P) of C. Mallavaram Village, Tirupati Rural Mandal vide RDP.No. RDP2023/TUDA/ CHRLPLE/00006/REV

The Road Development Plan/Master Plan extracts showing the above mentioned roads are placed in the Notice Board at TUDA Office and also in TUDA web site in **www.tudaap.in.**

Hence, the general public are hereby informed to submit objections/suggestions if any within 15 days from the date of this publication, to the Vice Chairman, TUDA pertaining to the above proposals failing which it will be construed that there are no objections/ suggestions and the above proposals will be processed as per rules.

Sd/- Shubham Bansal, Vice Chairman, TUDA, Tirupati

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో శనివారం ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు అలరించింది. విజయవాడకు చెందిన నృత్య కళాంజలి చెందిన కళాకారులు హరిణి, రేవతి, వెంకటేశ్వర్లు, భవిత, కామాక్షి, భవ్య తితరులు మూషిక వాహన, బ్రహ్మాంజలి, శృంగారలహరి కీర్తన, అదిగో అల్లదిగో, నగుమోము వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. వీరికి శిల్పారామం ఏవో సుధాకర్ జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందజేశారు.

తిరుచ్చిపై యశోద తనయుడి అభయం

తిరుచానూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణునికి శనివారం సాయంత్రం తిరువీధి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం రోహిణిని పురస్కరించుకుని మూలవర్లు, ఉత్సవర్లకు వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో కృష్ణుడు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

బాలికల దినోత్సవ ర్యాలీ

రామచంద్రాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్‌సీపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనీలా అన్నారు. శనివారం లోకమాతపురం అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటమునెమ్మ, రూప, వరలక్ష్మి, కావమ్మ పాల్గొన్నారు.

చంద్రగిరి

తప్పిపోయిన బాలుడి అప్పగింత


పార్థివ్‌ను అప్పగిస్తున్న టీటీడీ జమేదార్ చిరంజీవి

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గంలో తప్పిపోయిన బాలుడ్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది. రాజంపేటకు చెందిన రమేష్ కుటుంబ సభ్యులతో శనివారం శ్రీవారిమెట్టు మార్గంలో వెళ్తున్నారు. మార్గంలో రమేష్ అన్న వెంకటేష్ కుమారుడు పార్థివ్ కనిపించలేదు. బాలుడు తనకు సమీపంలో ఉన్న టీటీడీ సెక్యూరిటీ జమేధర్ చిరంజీవిని కలిశాడు. టీటీడీ సిబ్బంది బాలుడు చెప్పిన సమాచారంతో అతని తండ్రి వెంకటేష్‌కు ఫోన్ చేశారు. తాను కువైట్‌లో ఉన్నానని, సోదరుడు రమేష్ ఫోన్ నెంబర్ ఇచ్చారు. రమేష్‌కు టీటీడీ సిబ్బంది ఫోన్ చేసి, తప్పిపోయిన పార్థివ్‌ని అప్పటించారు. విజిలెన్స్ సిబ్బందికి రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ- తిరుచ్చిపై ఊరేగుతున్న స్వామి

కల్యాణ వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పెరటాసి నెల నాలుగో శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మహిళలు భక్తి శ్రద్ధలతో ఆలయ ఆవరణలో దీపారాధన చేశారు. ఉదయం ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అనంతరం ఉత్సవర్లను అలంకరించి తిరుచ్చిపై ఊరేగించారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజి రంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి పాల్గొన్నారు.



పాడి రైతులకు మిక్సీల పంపిణీ

పాకాల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దామలచెరువులోని బీఎంసీ పరిధిలోని శనివారం శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం పాలమిత్రులకు దీపావళి కానుకగా మిక్సీలను పంపిణీ చేశారు. సంస్థ ఏరియా మేనేజర్ ప్రకాష్ మాట్లాడుతూ శ్రీజ డైరీలో సభ్యత్వం పొందిన పాడి రైతలకు లభించే ప్రయోజనాలను వివరించారు. ఎఫ్‌ఏ నిత్యానందరెడ్డి, నిరోష మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మోతి, సాగర్‌రెడ్డి, రాజేష్,పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని కార్యక్రమాన్ని వీక్షించిన రైతులు


మాట్లాడుతున్న వీసీ జేవీరమణ

తిరుపతి రూరల్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో పాల్గొన్న కార్యక్రమానికి సంబంధించి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని శనివారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని కళాశాల ఆడిటోరియంలో ప్రసారం చేశారు. జిల్లాలో పలు మండలాలకు చెందిన దాదాపు 300మంది రైతులు హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రధాని ప్రసంగాన్ని వర్సిటీ శాస్త్రవేత్తలు తెలుగులో రైతులకు వివరించారు. పీఎం ధన్‌ధాన్య క్రిషి యోజనలో భాగంగా పశుసంవర్ధక ప్రాజెక్టులకు మోదీ ప్రారంభోత్సవం చేశారు. జీఎస్టీ తగింపు వల్ల ప్రయోజనాలను వివరించారు. అనంతరం వర్సిటీలో చేపడుతున్న అభివృద్ధి, అవుటరీచ్ కార్యక్రమాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. వీసీ ప్రొఫెసర్ జేవీరమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఈ ప్రొఫెసర్ డాక్టర్ బి.శోభామణి, డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతిరామయ్య డాక్టర్ సుజాత, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పరిచయ్-2కే25


బహుమతి అందిస్తున్న రవిమనోహరాచారి

తిరుపతిరూరల్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): కరకంబాడీరోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో పరిచయ్-2కే25పేరిట శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే ఆకట్టుకుంది. ముఖ్యఅతిధిగాఏఎస్పీ రవిమనోహరాచారి హాజరయ్యారు..సైబర్‌నేరాలపై యువత అప్రమత్తంగా ఉంటూ ప్రజలను చైతన్య పరచాలని ఆయన విద్యార్థులకు హితవు పలికారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ.. చదువుతో పాటు నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అకడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బహుమతులు ప్రదానం చేశారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, వాసు పాల్గొన్నారు.

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాయలచెరురు పంచాయతీ చాయాపురంలో వెలసిన ఛాయామార్తాండ శనీశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని సుప్రభాత సేవతో మొల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రీతికరమైన తైలాభిషేకం చేశారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోదండరాముడి పవిత్రోత్సవాలకు అంకురార్పణ


ఆగమ సలహాదారులు కాండూరు శ్రీనివాసచార్యులు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు పాల్గొన్నారు.

చంద్రగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండరామస్వామివారి ఆలయంలో ఈనెల 12 నుంచి 14 వరకు జరిగే పవిత్రోత్సవాలకు శనివారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. ఈక్రమంలో సాయంత్రం మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం నిర్వహించి, శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. సంవత్సరం పొడవునా ఆలయంలో జరిగిన దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. గృహస్తులు(ఇద్దరు) రూ.200 చెల్లించి ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు.

గరుడ వారధి మృతులకు నాని సంతాపం

- ఎమ్మెల్యే కుమారుడు వినీల్ నివాళి


వాత్సవ మృతదేహానికి వినీల్ నివాళులు

చంద్రగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గరుడ వారధిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే పులివర్తి నాని ఒక ప్రకటనలతో సంతాపం ప్రకటించారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే పులివర్తి నాని మృతుల కుటుంబానికి ఫోన్ చేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈక్రమంలో శనివారం ఎమ్మెల్యే కుమారుడు వినీల్ కొటాల గ్రామానికి చెందిన వాత్సవ, కందులవారిపల్లెకు చెందిన కనిష్క మృతదేహాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టపాసుల కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న రెవెన్యూ,పోలీసు అధికారులు

తిరుపతి అర్బన్, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న దీపావళి పర్వదినం సందర్భంగా నగర పరిధిలో మూడు ప్రాంతాల్లో ఏర్పాటుచేయనున్న టపాసుల విక్రయ కేంద్రాలను రెవెన్యూ, పోలీసు అధికారులు శనివారం పరిశీలించారు. స్థానిక శ్రీపండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ మైదానం(22దుకాణాలు), మారుతీనగర్‌లోని హథీరాంజీమఠం స్థలంలో(16దుకాణాలు), డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని ఏడీఆర్ మైదానం(18దుకాణాలు)లో విస్తృతంగా పర్యటించారు. ఆయా కేంద్రాల్లో నిబంధనలు తప్పక పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో తిరుపతి అర్బన్ మండల తహసీల్దార్ సురేష్‌బాబు, డీటీ రామచంద్ర, సర్వేయర్ రమేష్‌కుమార్, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, యూనివర్శిటీ సీఐ రామయ్య, వెస్ట్ సీఐ మురళీమోహన్‌రావు, మున్సిపల్ ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓఆర్‌ఐను సందర్శించిన ఎస్వీయూ వీసీ


తాళపత్రాలను పరిశీలిస్తున్న నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఓఆర్‌ఐ విభాగాన్ని వీసీ నరసింగరావు శనివారం సందర్శించారు. ప్రాచీన విజ్ఞాన సంపదను పరిరక్షించడం యూనివర్సిటీకి ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. అక్కడున్న ప్రాచీన తాళపత్ర గ్రంథాలను గురించి ఓఆర్‌ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో రీసెర్చ్, ఎగ్జామ్స్ డీన్లు నరసింహం, సురేంద్రబాబు, ఎన్‌ఎస్‌ఎస్ కో-కోఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి మహిళ మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం ఎన్‌ఎస్‌ఆర్ కాలనీ సమీపంలో రైలు కిందపడి మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. కుమ్మరివీధికి చెందిన మస్తానమ్మ(55)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. శనివారం ఉదయం ఎన్‌ఎస్‌ఆర్ కాలనీ సమీపంలో రైలు కిందపడి మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనవిజ్ఞాన వేదిక కార్యవర్గం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వేదిక నాయకులు

పాకాల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్కూల్ వేదికగా జిల్లా జనవిజ్ఞాన వేదిక మండల శాఖ కార్యవర్గాన్ని ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప ప్రకటించారు. అధ్యక్షుడిగా వనపర్తి వెంకట సిద్దులు, గౌరవాధ్యక్షుడిగా సాత్యకి, ఉపాధ్యక్షుడిగా అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జయచంద్ర, సహాయ కార్యదర్శిగా కృష్ణబాబు, కోశాధికారిగా గణపతిని ఎన్నికయ్యారు. అనంతరం జన విజ్ఞాన వేదిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు మధు, లక్ష్మి, షాతాజ్‌లు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న చిన్నగోవిందు

తిరుపతిరూరల్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లెలోని సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చిన్నగోవిందు మాట్లాడుతూ..ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. జూనియర్లు, సీనియర్లు కలసిమెలసి ఉండాలన్నారు. రాయలసీమ న్యాయకళాశాల ప్రతినిధి ఆర్.జగదీష్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజశేఖర్, డాక్టర్ పి.రవి, జి.నరేంద్రనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలలో అనధికార వ్యక్తుల తరలింపు

తిరుమల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుమలలోనే తిష్టవేసిన అనధికార వ్యక్తులను తిరుపతికి తరలించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఇటీవల అనధికార వ్యక్తుల సంఖ్య పెరిగిందని గుర్తించిన పోలీసు, విజిలెన్స్, హెల్త్ విభాగాలు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా ఉంటున్న 45 మంది వ్యక్తులను గుర్తించి ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుపతికి తరలించారు. మరికొద్ది రోజులపాటు తనిఖీలు కొనసాగనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

ఎండిన చెట్టును తొలగించండి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి-కరకంబాడి మార్గంలోని గెస్ట్‌లైన్‌డేస్ హోటల్ నుంచి హీరో హోండా షోరూం వరకు నూతనంగా రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మధ్యలో భారీ వృక్షం ఎండిపోయి కూలడానికి సిద్ధంగా వుంది. ఈ రహదారిలో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు, కార్లు, జీపులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ సమయంలో ఎండిన వృక్షం వర్షాలకు తడిసి కూలిపోతే, ప్రాణనష్టంతో పాటు ఆస్తి నష్టం జరిగే అవకాశం వుందని ప్రజలు ఆందోళ చెందుతున్నారు. నగర పాలక సంస్థ, అటవీ శాఖ అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించి, ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ అభివృద్ధి.. ఏ ప్రయాణికులకు ఉపయోగం..?


భవనం బయట ఎలివేషన్ నిర్మాణ పనులు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రైల్వే స్టేషన్ బయట ప్రధాన ముఖద్వారానికి ఒక వైపు ఎలివేషన్ పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేసి గత నాలుగు నెలలుగా నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ నిర్మాణ పనుల వల్ల ఎవరికి ఉపయోగమని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు రైల్వేస్టేషన్‌ను రూ.120 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. దివ్యాంగుల రహదారిని మూసివేసి ఈ పనులు చేపడుతున్నారు. ప్రతి స్టేషన్‌లోనూ దివ్యాంగులకు ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేస్తారు. ఇక్కడ ఆ వసతిని కూడా లేకుండా చేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గత మూడు రోజులుగా ఈ స్టేషన్ నుంచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజర్ రైళ్లను నడుపుతున్నారు. స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు ఈ అసౌకర్యాన్ని చూసి ఈ నిర్మాణాలు అధికారుల కమీషన్ల కోసం తప్ప, ఎందుకని చర్చించుకుంటున్నారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచిస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికుల ధనాన్ని వృధా చేయకుండా, అనవసర కట్టడాలను నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అందరూ జాగ్రత్తగా ఉండాలి..!

● పులి సంచారంపై ఎస్వీయూ వీసీ నరసింగరావు



పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పులి సంచారం నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్వీయూ వీసీ నరసింగరావు సూచించారు. ఎస్వీయూనివర్సిటీలో పులి సంచరించిన ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులు, ఉద్యోగులు, సందర్శకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్ప రాత్రివేళల్లో వెలుపలికి రాకూడదని కోరారు. సెక్యూరిటీ సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అటవీ శాఖ అధికారులకు పులి సంచారంపై సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీలో విద్యార్థులు, ఉద్యోగులందరినీ అప్రమత్తం చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

యూత్ ఎంటర్‌టైనర్‌గా 'ప్రేమిస్తున్నా'



సమావేశంలో మాట్లాడుతున్న హీరో సాత్విక్ వర్మ

తిరుపతి(జీవకోన), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నవంబరు 7న విడుదల కానున్న ప్రేమిస్తున్నా సినిమా యూత్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని ఆ చిత్ర హీరో సాత్విక్ వర్మ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సినిమాలో ప్రధానంగా ప్రేమ, అమ్మ సెంటిమెంట్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. ఇప్పటికే సినిమా టీజర్‌ను యూట్యూబ్‌లో రిలీజ్ చేశామని మంచి రెస్పాన్స్ వచ్చిందన్నారు. తాను హీరోగా చేస్తున్న మొదటి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలన్నారు. డైరెక్టర్ భాను మాట్లాడుతూ సాత్విక్ వర్మ చైల్డ్ ఆర్టిస్టుగా 90కిపైగా సినిమాలు చేశారని, హీరోగా ప్రేమిస్తున్నా సినిమా మొదటిదన్నారు. చిత్రంలో నటించిన ప్రీతినేహా తిరుపతి వాసేనని చెప్పారు. సమావేశంలో చిత్రబృందం కనకదుర్గారావు, రవికుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ గోపాల్‌కు కలాం సేవా పురస్కారం



డాక్టర్ గోపాల్‌కు కలాం విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న దృశ్యం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీయూకు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణులు, రచయిత డాక్టర్ గోపాల్‌కు కలాం విశిష్ట పురస్కారం లభించింది. స్థానిక మహతి కళాక్షేత్రంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో కలాం ట్రస్టు ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ సుబ్రమణ్యం, కలాం ట్రస్టు అధ్యక్షులు బాషా, రమేష్‌నాథ్, ఆయూబ్‌ఖాన్, రూపా శేషాద్రి, తహసున్నీసా బేగం, స్వరాజ్యలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరుపతి

సీబీఎస్‌లో 'స్త్రీ శక్తి' ప్రభావం

● నాన్‌స్టాప్, అల్ట్రాడీలక్స్‌లతోనే సమస్య

● మహిళలకూ తప్పని నిరీక్షణ



కాణిపాకం ప్లాట్‌ఫామ్ వద్ద బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు - బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు - అల్ట్రాడీలక్స్ ఆగినా ఎక్కని మహిళలు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వారాంతంలో రెండు రోజులపాటు సెలవులు రావడంతో సెంట్రల్ బస్సు స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ బాగాపెరిగింది. ప్రధానంగా శ్రీకాళహస్తి, వెంకటగిరి, కాణిపాకం, మదనపల్లె, పీలేరు ప్లాట్‌ఫామ్‌లలో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో నిరీక్షించారు. మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం అమలు చేసిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రముఖ దేవాలయాల సందర్శనార్థం ప్రయాణికుల రద్దీ రెట్టింపు అయ్యింది. దీనిని గమనించిన ఆర్టీసీ యంత్రాంగం స్త్రీ శక్తి మునుపు నడుస్తున్న షెడ్యూల్స్‌ను యథావిధిగా కొనసాగిస్తోంది. శ్రీకాళహస్తికి నాలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులు, కాణిపాకానికి అల్ట్రాడీలక్స్ బస్సులను ఫేర్‌టిక్కెట్‌కు అనుకూలంగా తిప్పుతోంది. దీంతో మెజారిటీ మహిళలు ఈ బస్సులను ఎక్కడం లేదు. ప్లాట్‌ఫామ్‌ల వద్దే వేచివుంటున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. గంటల కొద్దీ నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఓపిక నశించి వచ్చిన బస్సుల్లో సీట్లకోసం పోటీపడుతున్నారు. బస్సు ఎక్కే క్రమంలో చంటి పిల్లలు నలిగిపోతున్నారు. ఈ సమస్యలు శనివారం ఉదయం నుంచి ఆయా ప్లాట్‌ఫామ్‌ల వద్ద మరింత ఎక్కువగా కనిపించింది. రద్దీని క్రమబద్ధీకరించడానికి సెక్యూరిటీ గాని, ఆర్టీసీ సిబ్బందిగాని లేరు. స్త్రీ శక్తి ప్రవేశపెట్టిన తరువాత ప్రతి రూట్‌లో ఐదు రకాల బస్సులు వెంట వెంటనే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని ఉంటే ఈ సమస్య ఉండేది కాదని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిస్థితిని సమీక్షించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అలిపిరి పాదాల మండపం వద్ద పోటెత్తిన భక్తజనం

● పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్న భక్తులు



అలిపిరి పాదాల మండపం వద్ద భక్తుల రద్దీ - పిండి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద పెరటాసి మాసం నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు అలిపిరి మండపం వద్దకు వచ్చి పిండి దీపాలను వెలిగించి, పూజలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. మండపంలోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నడక మార్గంలో తిరుమలకు వెళ్లే భక్తులు.. పూజలు చేయడానికి వచ్చిన భక్తులతో పాదాల మండప ప్రాంతం నిండిపోయింది. గోవింద నామ స్మరణలతో మార్మోగింది.

గరుడవారధిపై సేఫ్టీరెయిలింగ్, స్పీడ్ లిమిట్ గన్స్ ఏర్పాటు చేయాలి

● బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గరుడవారధి ఫ్లైఓవర్‌పై సేఫ్టీ రెయిలింగ్, స్పీడ్ లిమిట్ గన్స్ ఏర్పాటు చేయాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థంతో పాటు తిరుపతి నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం టీటీడీ, స్మార్ట్‌సిటీ, నగర పాలకసంస్థ నిర్మించిన గరుడ వారధిపై జరుగుతున్న ప్రమాదాల కారణంగా సంవత్సకాలంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. శుక్రవారం లక్ష్మీపురం సర్కిల్ వద్ద యువకులు గోడను ఢీకొట్టి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి ఇరువైపులా సేఫ్టీ రెయిలింగ్‌తో పాటు స్పీడ్ లిమిట్ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ఉద్యోగికి బంగారు నంది అవార్డు



బంగారు నంది అవార్డు అందుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగి సుబ్రహ్మణ్యం

తిరుపతి (ఆర్టీసీ), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మంగళం ఆర్టీసీ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ గుండ్లూరు సుబ్రహ్మణ్యంకు బంగారు నంది అవార్డు లభించింది. సమాజంపై ఆయన జానపద కవితలు, రచనల ప్రతిభను గుర్తించి మ్యాక్స్ గ్లోబర్స్ ఫౌండేషన్ సంస్థ ఉత్తమ రచయితగా ఎంపికచేసింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి హైదరాబాదులోని పొట్టిశ్రీరాములు యూనివర్సిటీ ఎన్టీఆర్ కళామందిరంలో 2025 సంవత్సరానికి గాను ఆ సంస్థ అధినేత దినేష్ దక్షిణ భారత బంగారు నంది అవార్డును ప్రదానం చేశారు. శాలువకప్పి సన్మానించారు. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, రచయితలు సుబ్రహ్మణ్యంను అభినందించారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



కంచి రఘురాంను సన్మానిస్తున్న పిరమిడ్ మాస్టర్లు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని విశాఖపట్నంలో పనిచేస్తున్న డీఎస్పీ బాలిరెడ్డి అన్నారు. తిరుపతి బీమాస్ ప్యారడైస్‌లో శనివారం అష్టాదశ అష్టోత్తర శత ప్రాంత ధ్యానోత్సవ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ధ్యాన శక్తి పీఠాల విజయోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్లకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన అనంతరం లీలాచౌదరి సంగీత ధ్యానంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. తర్వాత సామూహిక ధ్యానం చేశారు. అనంతరం తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీకి చెందిన కంచి రఘురాంను సత్కరించారు. జయరామిరెడ్డి, జయచంద్రారెడ్డి, పులివెందుల, ప్రొద్దుటూరు, తాడిపర్తి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన మూడు ఫోన్లు స్వాధీనం

● ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసంలో శనివారం ఇద్దరు భక్తులు నిద్ర పోతున్న సమయంలో వారి బ్యాగులో వున్న మూడు ఖరీదైన మొబైల్ ఫోన్లను దొంగలు అపహరించారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేశారు. మొబైల్ దొంగల కోసం శ్రీనివాసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో శ్రీనివాసం పరిసర ప్రాంతాల్లో ఉంటున్న కదిరికి చెందిన పవన్‌కుమార్, తెలంగాణకు చెందిన దినేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద వున్న మూడు మొబైల్ ఫోన్లను చోరీకి గురైన ఐదారు గంటల వ్యవధిలోనే రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. దీంతో బాధితులు ఎస్ఐ రామాంజనేయులకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవాన్ని తమిళనాడులో దెబ్బతీస్తున్నారని విజయవాడకు చెందిన శ్రీరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరువన్నామలైలో గిరి ప్రదక్షిణకు వెళుతున్న తెలుగు భక్తులపై అక్కడి తమిళులు దాడి చేస్తున్నారని తెలిపారు. బోర్డులపై తెలుగు బాషలో ఉన్న సమాచారంపై పెయింట్ వేయడం, ప్రజా రవాణా బస్సుల్లో అరుణాచలం పేరు తీసివేయడం జరుగుతోందన్నారు. మధుబాబు, మహేష్, కేఆర్‌నాయుడు, చంద్రబోస్, శ్రీనివాసులు ఆయన వెంట వున్నారు.

ఈత పోటీల్లో

జిల్లా క్రీడాకారుల సత్తా



వెంకటేష్‌ను అభినందిస్తున్న డీఎస్‌డీవో

తిరుపతి (క్రీడలు), అక్టోబరు 11(ఆంధ్ర జ్యోతి): గుంటూరులోని ఎన్టీఆర్ మున్సిపల్ ఈత కొలనులో శుక్రవారం జరిగిన 8వ అంతర్ జిల్లా సీనియర్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు నాలుగు గోల్డ్‌మెడల్స్ లభించాయి. ఇందులో తిరుచానూరు సమీపంలోని ముళ్లపూడి గ్రామానికి చెందిన వెంకటేష్(67) నాలుగు అంశాలలో పాల్గొన్నారు. ఫ్రీస్టైల్లో 25మీటర్లు, బ్రెస్ట్ స్ట్రోక్‌లో 25మీటర్లు, బ్యాక్ స్ట్రోక్‌లో 25, 50మీటర్లలో గెలుపొందారు. ప్రథమ స్థానం దక్కించుకొని నాలుగు స్వర్ణపతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో ఎస్.శశిధర్ క్రీడాకారుడు వెంకటేష్‌తో పాటు కోచ్ చక్రవర్తిని ప్రత్యేకంగా అభినందించారు. పలువురు ప్రముఖ క్రీడాకారులు, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు కూడా ఆయన్ను అభినందించారు.

క్రియాస్ కిచెన్ ప్రారంభం

తిరుపతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ (వాల్మీకి సర్కిల్) కూడలి సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో క్రియాస్ కిచెన్ రాయలసీమ రుచుల రెస్టారెంట్ శనివారం ప్రారంభమైంది. ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, సామంచి శ్రీనివాస్, నిర్వాహకులు జితేంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఊబకాయం సమస్య పరిష్కారం సులభతరం



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ మొయినుద్దీన్

తిరుపతి (జీవకోన), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఊబకాయం సమస్య పరిష్కారం చాలా సులభతరమని మణిపాల్ ఆస్పత్రి సౌత్‌ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.మొయినుద్దీన్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీలో ప్రజలు పాలిష్ చేసిన బియ్యాన్ని అధికంగా వినియోగిస్తుండటంతో జీవక్రియ సంబంధిత వ్యాధులు పెరిగే అవకాశం ఉందన్నారు. దీంతో అధిక బరువు, ఊబకాయంతో బాధపడుతున్నారన్నారు. తమ ఆస్పత్రిలో ఊబకాయం, అధిక బరువుతో బాధపడుతున్న వారికి సర్జరీ అందుబాటులో ఉందని తెలిపారు. తిరుపతికి చెందిన మధుబాబు మాట్లాడుతూ తాను మణిపాల్ ఆస్పత్రిలో డాక్టర్ మొయిద్దీన్‌తో సర్జరీ చేయించుకున్న తర్వాత 140 నుంచి 90 కిలోలకు బరువు తగ్గినట్లు తెలిపారు.

ఏసీఎఫ్ఐ ఏపీచాప్టర్ ఛైర్మన్ ఎన్నికపై హర్షం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎయిర్ కార్గో ఫోరం ఇండియా ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఛైర్మన్‌గా డాక్టర్ జి.సాంబశివరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.చౌదరి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఈయన ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా వ్యవహించారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాలను ప్రపంచవ్యాప్తంగా అనుసంధానించడమే ఏసీఎఫ్ఐ ప్రధాన లక్ష్యమన్నారు. తద్వారా మామిడి, వివిధ రకాల పండ్లు, కూరగాయల ఎగుమతి పెరిగి రైతులకు, వ్యవసాయరంగానికి మేలు చేకూరుతుందని తెలిపారు.

సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షకు 31లోపు దరఖాస్తు చేసుకోవాలి

తిరుపతి(విద్య), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): 2026-27 విద్యా సంవత్సరానికి సైనిక్ స్కూల్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి గాను జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షకు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31వ తేదీ మధ్య జన్మించినవారు 6వ తరగతిలో ప్రవేశానికి, 2011 ఏప్రిల్ 1 నుంచి 2013 మార్చి 31వ తేదీ మధ్య జన్మించినవారు 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వివరాలకోసం స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్, నవోదయ పోటీ పరీక్షల కేంద్రంలోగాని, 86888 88802 / 93999 76999 నంబర్లలోగాని సంప్రదించాలని సూచించారు.

హోంమంత్రి మాటలు దారుణం: నారాయణస్వామి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వెదురుకుప్పం మండలం దేవళంపేటలో హోంమంత్రి అనిత మాట్లాడిన మాటలు దారుణంగా ఉన్నాయని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చేంత దిగజారుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు.ఈ ఘటనపై సీబీఐ ఎంక్వయిరీ వేయాలని డిమాండ్ చేశారు. ములకలచెరువు ఘటనను తప్పుదోవ పట్టించడానికే తెరమీదకు దేవళం పేట ఘటనను తీసుకువచ్చారని ఆరోపించారు.వైసీపీ నేతలు అజయ్‌కుమార్, తలారి రాజేంద్ర పాల్గొన్నారు.

■ వెంకన్న సేవలో ప్రముఖులు



రేఖారాణి



హరితేజ

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ కమిషనర్ రేఖారాణి, సినీనటి హరితేజ, చెన్నై సిటీ కమిషనర్ అరుణ్ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు





జస్టిస్ బీ కృష్ణమోహన్ - జస్టిస్ రవి చీమలపాటి

తిరుమల శ్రీవారిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో జస్టిస్ బీ కృష్ణమోహన్, జస్టిస్ రవి చీమలపాటి దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,468

తలనీలాలు సమర్పించినవారు: 26,878





పిల్లలకు పిజ్జా తినిపిస్తూ..

చౌడేపల్లెకు చెందిన రెడ్డెప్ప పుట్టుకతో అంధుడు. తిరుచానూరులోని నవజీవన్ బ్లైండ్ స్కూల్లో పాటలు పాడటంలో నేర్పరి. ప్రేరణ సేవా సంస్థ ప్రోత్సాహంతో ఇప్పుడు హైదరాబాద్‌లోని ఎంఎన్ఆర్ పాఠశాల అండ్ కళాశాలలో సంగీత ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు.

తిరుపతి బైరాగిపట్టెడలోని మాతృశ్రీ చైల్డ్‌హోమ్ పిల్లలకు సముద్రం చూడాలనే కోరిక కలిగింది. వారి కోరికను తీర్చేందుకు 'ప్రేరణ' ముందుకువచ్చింది. ఆనందసాగరంలో ముంచెత్తి వారితో సంతోషాన్ని పంచుకుంది.

శ్రీవెంకటేశ్వర డెఫ్ అండ్ డమ్ పాఠశాల విద్యార్థులకు 'ప్రేరణ' అందించిన శిక్షణ జీవితాల్లో వెలుగులు నింపింది.

నేనున్నానని...



సముద్రంలో జలకాలాడుతూ మాతృశ్రీ చైల్డ్‌హోమ్ పిల్లల ఆనందం



ఎస్వీడీడీ పాఠశాల విద్యార్థుల నృత్యం



ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలను ఆడిస్తున్న ప్రేరణ సభ్యులు



వృద్ధాశ్రమంలో వృద్ధులతో మాటామంతి



ఆశ్రమంలో నిత్యావసరాలను అందిస్తూ..

అసహాయులకు బాసటగా 'ప్రేరణ' సేవాసంస్థ

18ఏళ్ల మానవతా ప్రస్థానంలో ఎందరికో చేదోడువాదోడు


ఆంధ్రజ్యోతి - తిరుపతి(కల్చరల్)

అసహాయులకు తోడుగా నిలుస్తోంది. ఆనందాన్ని పంచుతోంది. వారిలోని ప్రతిభకు పట్టం కడుతోంది. సేవకు ప్రతిరూపమై ప్రత్యేక ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది ప్రేరణ సేవా సంస్థ. ముగ్గురు విద్యార్థుల ఆలోచన ఫలితమే ఈ మానవతా సంస్థ ఆవిర్భావానికి బీజం వేసింది. తిరుపతిలోని శ్రీవిద్యానికేతన్‌లో బీఎస్సీ బయో టెక్నాలజీ చదువుతుండగా రాజశేఖర్, భార్గవి, విద్యాశ్రీలకు ఎదురైన అనుభవాలూ ఈ సంస్థ ఏర్పాటుకు కారణమైంది. రోడ్డుపై భిక్షాటన చేస్తున్న బాలల్ని ఈ విద్యార్థులు చూశారు. చదువుకోవాల్సిన చిన్నారులు దారి తప్పిన తీరు తెలుసుకుని చలించిపోయారు. చదువుపై ఆసక్తి చూపిన వారికి పుస్తకాలు కొనిచ్చారు. కొంతమంది స్వార్థంతో ఇలాంటి పిల్లలు చెడు దారి పడుతున్నారని గుర్తించారు. బాధిత పిల్లలను చేరదీసి ఆశ్రమంలో చేర్పించారు. ఈ సంఘటనలు ఆ ముగ్గురు విద్యార్థులనూ సేవాపథం వైపు నడిపించాయి. 2008లో తమ కళాశాల అధ్యాపకులు శ్రీలత, రవీంద్రల ప్రోత్సాహంతో వీరు ప్రేరణ పేరిట హెల్పింగ్ సొసైటీని ఏర్పాటు చేశారు. తొలి రోజుల్లో సహచరుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహించేవారు. ఏడాదిలోపు 43 మంది సభ్యులకు సంస్థ చేరింది. ఇప్పుడు సుమారు 300లకు పైగా సభ్యులతో బలమైన వృక్షంగా మారింది. ఈ సంస్థలో సభ్యులంతా విద్యార్థులే. వివిధ కళాశాలల్లో చదువుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పం ఉన్నవారే.

ఎక్కడ ఉన్నా వీడని బంధం..

ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆరంభంలో ఉన్న విద్యార్థులు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అయినా ప్రేరణతో బంధం వీడలేదు. వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తూనే తమ జూనియర్స్‌ను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తున్నారు. తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వీరిలో రాజశేఖర్ తిరుపతి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు మేనేజరుగా పనిచేస్తున్నారు. భార్గవి చెన్నైలో, దిగ్విజయ్ బెంగళూరులో పనిచేస్తున్నారు. ఇలా పలువురు ప్రేరణ సభ్యులు ఉద్యోగాలూ చేస్తూ వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నా వార్షికోత్సవం వచ్చిందంటే రెక్కలు కట్టుకుని తిరుపతిలో వాలిపోతున్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల నృత్య, సంగీత కార్యక్రమాలు నిర్వహించి వారితో సంతోషాలను పంచుకుంటున్నారు.

ఓ విద్యార్థిని కోసం వార్షికోత్సవం..



రెడ్డెప్ప

తొలి ఏడాది సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు నవజీవన్ బ్లైండ్ స్కూల్‌ను సందర్శించారు. ఆ సమయంలో రోజా అనే విద్యార్థిని బాధపడుతూ కనిపించింది. జ్వరం జలుబు, దగ్గు కారణంగా పోటీల్లో బాగా పాడలేకపోయానని రోదించింది. ప్రేరణ సభ్యుల్లో ఒకరైన భార్గవి ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకుంది. మంచి వేదికపై పాటపాడే అవకాశం కల్పిస్తామని మాటిచ్చింది. దాంతో ఆ విద్యార్థిని పట్టలేని ఆనందంతో గంతేసింది. ఆ అమ్మాయికి ఇచ్చిన హామీ నెరవేర్చాలనే క్రమంలో పుట్టుకొచ్చిందే తొలి వార్షికోత్సవ నిర్ణయం. వార్షికోత్సవం నిర్వహించేందుకు ఆర్థికంగా స్థోమత లేకున్నా ధైర్యంగా ముందడుగు వేశారు. తమ తరగతితో పాటు ఇతర తరగతులు.. వివిధ విద్యాసంస్థల్లో విరాళాలు సేకరించారు. మొత్తం మీద తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తొలి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేదికపై రోజా కమ్మని గీతంతో అందరి హృదయాలను దోచుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాటి టీటీడీ ఈవో కేవీ రమణాచారి ప్రేరణ సేవలను అభినందించారు. మహతిలో ఎప్పుడు కార్యక్రమం నిర్వహించాలన్నా ఉచితంగా అవకాశం కల్పిస్తూ నిర్ణయాన్ని ప్రకటించారు. 2008లో తొలి ఏడాది వార్షికోత్సవంలో అందిన ప్రోత్సాహంతో 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంది 'ప్రేరణ' సేవా సంస్థ.



ప్రేరణ సభ్యులు

మురికి కాలువలో పసికందు



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి ఏమి కష్టం వచ్చిందో ఏమో ఇంకా కళ్లు కూడా తెరవని పసికందును మురికి కాలువలో పడేసింది. తిరుపతి సింగాలగుంటలోని మసీదు వీధిలో కాలువలో పడి ఉన్న ఆ పసికందు శవాన్ని అక్కడ పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది గుర్తించారు. స్థానిక వీఆర్వోకు సమాచారం అందించారు. వీఆర్వో అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ అజిత అక్కడికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

రేపు ఇంటర్ విద్యార్థులకు జాబ్‌మేళా

- ఉన్నత విద్యకూ అవకాశం

తిరుపతి(విద్య), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. టెక్‌బీ ప్రోగ్రాంతోపాటు కంపెనీ ఆర్థిక సాయంతో ఉన్నత చదువులు చదివే అవకాశం కూడా కల్పించనున్నారన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పెద్దగా ఉద్యోగావకాశాలు ఉండని క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇంటర్ విద్యామండలి హెచ్‌సీఎల్ ద్వారా ఈ మేళాను ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతోపాటు ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్, ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 2024, 2025 సంవత్సరాల్లో కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులైనవారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. టెక్‌బీ ప్రోగ్రాంకు ఎంపికైన వారికి సంవత్సరంపాటు శిక్షణ ఉంటుంది. ఇంటర్న్‌షిప్ సమయంలో అభ్యర్థికి నెలకు రూ.10వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి నెలకు రూ.2.20 లక్షల జీతంతో ఉద్యోగం లభిస్తుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://bit.ly/TechbeeGoAP లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకోనివారు 13వ తేదీన ఎంపికల సమయంలో కంపెనీ ప్రతినిధులతో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఇతర వివరాలకు హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధి ఎన్.రాజ్‌కుమార్‌ను 7780323850లో సంప్రదించవచ్చునని వివరించారు.

తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుమల, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో వెంగమాంబ అన్నప్రసాద భవనం వెలుపల గేటు వద్ద అచేతనంగా పడి ఉండటాన్ని భద్రతా సిబ్బంది గుర్తించారు. అశ్విని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 94407 96769కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ముక్కంటి ఆలయంలో 22నుంచి కార్తీక మాస పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి నవంబరు 20వ తేదీ వరకు కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయం తెరచు వేళలు, సోమవారం రోజున ప్రాతఃకాల అభిషేకాలు, పవళింపు సేవల సమయాలలో మార్పులు చేసినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. మోహనమంత్ర







ఉర్రూతలూగిస్తున్న డీజే - పాల్గొన్న విద్యార్థులు - కేరళ వాయిద్యాలను తిలకిస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మోహనమంత్ర కార్యక్రమం రెండవ రోజు శనివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. హర్రర్ హౌస్, కళాక్షేత్ర, రాంప్‌వాక్,ఫొటోషూట్, గల్లీ క్రికెట్, రింగ్ టాస్, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ ట్రెయిన్, ట్రెజర్ హంట్ తదితర కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. సాయంత్రం డీజే పరోమా (ముంబై) ప్రొ షో విద్యార్థులను ఉర్రూతలూగించింది. ఈ సందర్భంగా ఎంబీయూ వైస్ చాన్సలర్ డాక్టర్ నాగరాజరామారావు మాట్లాడుతూ నిర్వహించిన వర్క్‌షాపులు విద్యార్థుల మేధోసంపత్తికి దోహదపడ్డాయన్నారు. కాగా కళావేదికపై విద్యార్థులు నిర్వహించిన నృత్య గాన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. టెక్నికల్ విభాగంలో రోబోవార్స్ కార్యక్రమంలో వీసీ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సందడి చేశారు. ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు పాల్గొని ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రేణిగుంట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గువ్వలకాలనీలో శ్రీహరి హత్య కేసులో నిందితుడు ఎన్.మేస్త్రీ(33)ని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట రూరల్ సీఐ ఎం.మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. మేస్త్రీ భార్య భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయింది. ఈ క్రమంలో శ్రీహరి మేస్త్రీని హేళనగా మాట్లాడాడు. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. శుక్రవారం టిఫిన్ సెంటర్ వద్ద మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో మేస్త్రీ తన జేబులో నుంచి కత్తిని తీసి శ్రీహరి మెడపై పొడవంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. శ్రీహరి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.



నిందితుడు మేస్త్రీని అరెస్టు చేసిన పోలీసులు

21 ఎర్రచందనం దుంగల స్వాధీనం



మంగళం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం గొల్లపల్లి బీట్ పరిధిలో శనివారం తిరుపతి అటవీ శాఖ అధికారులు కూంబింగ్ నిర్వహించి పొదల్లో దాచి ఉంచిన 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రి వడమాలపేట మండలం పాదిరేడు సెక్షన్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా గొల్లపల్లి వద్ద పొదల్లో దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలు అధికారుల కంటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కూంబింగ్‌లో సెక్షన్ ఆఫీసర్ శంకరప్ప, బీట్ ఆఫీసర్లు మునినాయక్, జ్యోతి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితుల నియామకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డులో ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితుల పేర్లతో అధికారులు శనివారం అధికారిక జీవోను విడుదల చేశారు. చాగణం శైలజ, మొక్కపాటి వెంకటరమణనాయుడికి అవకాశం కల్పించారు.

పంట పొలాలపై 'గజ'దాడులు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లంపల్లె గ్రామ అటవీ ప్రాంత సమీప పంట పొలాలపై శుక్రవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. సాయంత్రం 6 గంటలకు ఏనుగుల గుంపు పులిచెర్ల అడవుల్లో నుంచి యల్లంపల్లె అటవీ ప్రాంతంలోకి చొరబడ్డాయి. రాత్రి 9 గంటల సమయంలో 8 ఏనుగులు పంట పొలాలపై దాడులు చేస్తుండటంతో గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు, గ్రామస్తులు కలిసి ఏనుగులు గ్రామంలోకి రాకుండా బాణసంచా పేల్చుతూ, డప్పులు వాయించారు. జ్ఞానప్రకాష్‌రెడ్డికి చెందిన వరి పైరును పూర్తిగా ధ్వంసం చేశాయి. పక్క పొలంలో ఇరిగేషన్ పైపులను ధ్వంసం చేశాయి. శనివారం వేకువజాము వరకు అవి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే తిరుగుతుండటంతో యల్లంపల్లె గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు ఇటువైపు రాకుండా అడ్డుకోవడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన ఇరిగేషన్ పైపులైన్

ఆకట్టుకున్న శోభారాజ్ గాత్రకచేరి



శ్రీవారి సహస్రదీపాలంకార సేవలో ప్రముఖ గాయని శోభారాజ్ గాత్ర కచేరి భక్తులను ఆకట్టుకుంది. శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామికి జరిగిన సహస్రదీపాలంకార సేవలో ఆమె పాల్గొన్నారు. శిష్య బృందంతో కలిసి శ్రీవారికి సంకీర్తనా కైంకర్యం చేశారు. తొలుత 'అన్నమయ్య గాయత్రి' మంత్రంతో ప్రారంభించి 'హరియవతారమీతడు అన్నమయ్య', 'ఈరూపమై ఉన్నాడు ఇతడే పరబ్రహ్మము' అను కీర్తలను రసరమ్యభరితంగా ఆలపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కల్యాణ వెంకన్నకు అభిషేక సింహాసనం కానుక



అభిషేక సింహాసనాన్ని అందజేస్తున్న దాతలు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు శనివారం అభిషేక సింహాసనం బహూకరించారు. బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీకి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి, యువజ్యోతిలు సుమారు రూ.9 లక్షల విలువ గల బంగారు పూత కలిగిన రాగి అభిషేక సింహాసనాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్చకులు నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ అక్రమాలకు పాల్పడిన 16 మందిపై కేసు

సత్యవేడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం వానెల్లూరు రెవెన్యూలో చోటు చేసుకున్న భూ మాయాజాలంపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు భూ అక్రమాలకు పాల్పడిన 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు. సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై వానెల్లూరు రెవెన్యూ పరిధిలో సుమారు 300 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించారు. ఈ భూ కుంభకోణంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 8వ తేదీన 'రెవెన్యూలో మాయాజాలం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులు, సిబ్బంది, అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీకి ఆదేశించారు. దీంతో తహసీల్దార్ రాజశేఖర్ సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు సీఐ మురళి కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో బాగంగా అప్పటి తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ సురేష్, వీఆర్వోలు రాఘవేంద్ర, భార్గవ్ అతని భార్య తేజశ్వి, విలేజ్ సర్వేయర్ వెంకటేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది పూర్ణచంద్రతోపాటు పట్టాలు పొందిన పీ.శ్రీధరన్, అమృతవర్షిణి, నవీన్ రాజ్‌ఖన్నా, అనురాధ జయకుమార్, లతజయ్‌కుమార్, ఆశాసురేష్ పట్టాల సృష్టికి ఆధార్ కార్డులు సమర్పించిన మల్లీశ్వరి, బత్తెమ్మ పేర్ల మీద ఐపీసీ 120ఏబీ, 420, 466, 467 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

తిరుపతి-అనకాపల్లి మధ్య 2 నుంచి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు తిరుపతిలో ప్రతి ఆదివారం, అనకాపల్లిలో ప్రతి సోమవారమూ రైళ్ల రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు (07481) ఆదివారం బయలుదేరి అనకాపల్లికి మరుసటి రోజు(సోమవారం) చేరుకుంటుంది. ఆదేరోజు ఈ ప్రత్యేక రైలు (07482) అనకాపల్లిలో బయలుదేరి మరుసటి రోజు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

పుత్తూరు వార్తలు

హోంమంత్రి అనితకు ఘనస్వాగతం



పుత్తూరు అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హోంమంత్రి వంగలపూడి అనితకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు ఘన స్వాగతం పలికారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు పర్యటన నిమిత్తం శనివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సక్సెస్



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలో సూపర్ జీఎస్టీ- సూపర్ సక్సెస్ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. శనివారం స్థానిక గోపాలకృష్ణపురంలో మండల పార్టీ అధ్యక్షుడు అరవ బాలాజీ సూపర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ పర్యటించి జీఎస్టీ సంస్కరణ కరపత్రాలను అందించి ప్రజలను చైతన్యం చేశారు. గృహోపకరణాలు, ఔషధాలు, స్టేషనరీ, వస్త్రాలు, క్రీడా పరికరాల కొనుగోలులో జీఎస్టీ తగ్గింపుతో ఒనగూరే ప్రయోజనాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు కుమార్, హరిగోపాల్, గంగయ్య, భారతి, జనసేన సభ్యురాలు శిరీష, మాజీ సర్పంచ్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార సేవలను సద్వినియోగం చేసుకోండి

పుత్తూరు టౌన్, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): రైతులు సహకార సంఘ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంఘ వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం తడుకు సహకార సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా పంట రుణాలు అందించడమే కాకుండా రాయితీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సంఘ సభ్యులు భాస్కర్, సీఈవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

పుత్తూరు టౌన్, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13, 14న పుత్తూరులో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పిలుపునిచ్చారు. శనివారం బీఎస్ఎన్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసినా సీఐటీయూ నాయకుల సమాశంలో ఆయన మాట్లాడారు. కేంద్రలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు తారాస్థాయికి చేరాయని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 13 గంటల పని విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం గర్హనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జనార్దన్, జయచంద్ర, మునిరాజ, వెంకటేష్, భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు ఖాతాలతో రైతులకు రుణసదుపాయం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు తెలియజేస్తున్న అమాస రాజశేఖర్ రెడ్డి

వడమాలపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో పొదుపు ఖాతాలు ప్రారంభించిన రైతులకు విరివిగా రుణసదుపాయాలు కల్పిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి చెప్పారు. శనివారం కాయంపేట సింగిల్ విండో కార్యాలయంలో సహకార సంఘాల ద్వారా రైతులకు లబ్ధిచేకూర్చే పథకాలు, వ్యవసాయ భూములపై రుణ సదుపాయాలపై ప్రధానమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమాస రాజశేఖర్ రెడ్డి మాట్లా డుతూ సహకార కేంద్ర బ్యాంకుల్లో బంగారు నగలపై తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనంజయులు నాయుడు, దాముయాదవ్, కుమార్, దేవ, శివ రాయల్, ఉమాపతి, వినోద్, మంజుల, వెంకటరమణ, సుబ్రమణ్యం, గురవయ్య పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన అప్పలాయగుంట





క్యూలైన్‌లలో దర్శనంకోసం వేచిఉన్న భక్తులు (ఉంజలసేవలో శ్రీవారు)

వడమాలపేట,అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెరటాసినెల నాల్గవ శనివారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామివారి దర్శనం కోసం తరలివచ్చారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంక టేశ్వరుని సర్వాంగ సుందరంగా ఊయలలో అలంకరింపజేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతీ, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరుని మేళతాలాలతో మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి స్వామి అమ్మవార్లను దర్శించారు. సుమారుగా 18 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సూపరిండెంటెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తిరుపతి పరిసరాలనుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడంతో వాహనాల రద్దీ నెలకొంది. ఈ కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

గైనకాలజిస్ట్ బాధ్యతల స్వీకరణ

- ఎమ్మెల్యే చొరవతో తెరుచుకోనున్న ఆపరేషన్ థియేటర్



చికిత్స అందిస్తున్నగైనకాలజిస్ట్ డాక్టర్ జరీనా

పుత్తూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు వైద్య విధానపరిషత్ ఆస్పత్రికి ఎట్టకేలకు గైనకాలజిస్టు వచ్చారు. డాక్టర్ జరీనా శనివారం బాధ్యతలు చేపట్టారు. దీంతో నాలుగు నెలలుగా మూత పడిన ఆపరేషన్ థియేటర్ గది తలుపులు తెరచుకోనున్నాయి. నాలుగు రోజు కిందట జిల్లా ఉత్తమ స్వచ్ఛ అవార్డును తీసుకున్న వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను కలిసి ఖాళీగా వున్న గైనకాలజిస్టు పోస్టును భర్తీ చేయాలని కోరారు. వెంటనే జిల్లా వైద్యాధికారులను సంప్రదించి నగరి ఏరియా ఆస్పత్రిలో ఉన్న గైనకాలజిస్టు డాక్టర్ జరీనాను ఇక్కడికి బదిలీ చేయించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నేతలు

గూడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో శనివారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పటిష్టతకు చేపట్టవలసిన చర్యలపై ఆయన పలు సూచనలు చేసినట్లు చెప్పారు.



షార్ రోడ్డుకు రివిట్‌మెంట్

కోతకు గురికాకుండా షార్ అధికారులు



షార్ రోడ్డు కోతకు గురికాకుండా నిర్మించిన రివిట్‌మెంట్

సూళ్లూరుపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డు కోతకు గురికాకుండా షార్ యాజమాన్యం చర్యలు చేపట్టింది. కుదిరి సమీపం నుంచి షార్ ముఖద్వారం వరకు పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా రక్షణ కవచంలా రివిట్ మెంట్ నిర్మాణం చేపట్టారు. ఏటా నవంబరు, డిసెంబరు మాసాల్లో వరదలకు పులికాట్ సరస్సుకు భారీగా వరదనీరు రావడంతో షార్‌కు వెళ్లే రోడ్డు చాలాచోట్ల కోతకు గురై ధ్వంసం అవ్వడం, కల్వర్టులు కుంగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పలు సందర్భాల్లో పులికాట్ నీరు పొంగి ప్రవహించడంతో తరచూ రోడ్డు మరమ్మతులకు గురవుతోంది. దీంతో వర్షాకాలంలో రోడ్డు కోతకు గురికాకుండా వరదనీరు వేగంగా ప్రవహించేందుకు అక్కడక్కడ కల్వర్టులు నిర్మించారు. అలాగే కుదిరి గ్రామ సమీపం నుంచి షార్ ముఖద్వారం వరకు దాదాపు 8 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా సుమారు రూ.80 లక్షల వ్యయంతో రివిట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. పులికాట్ సరస్సు నీరు ఉధృతంగా ప్రవహించే చోట రోడ్డుకు రక్షణగా దాదాపు 5 మీటర్ల వరకు గులకరాళ్లు సైతం అమర్చి రోడ్డుకు రక్షణ కవచంలా పనులు చేపట్టారు.

పేదలకు ఆసరా సీఎం సహాయనిధి: పాశిం



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు చికిత్స చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో 39 మంది లబ్ధిదారులకు రూ.19.46లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు మెరుగైన వైద్యచికిత్స పొందేందుకు వీలుగా సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సీఎం సహాయనిధిని నిర్వీర్యం చేసిందని, ఏ ఒక్కరికీ సాయం అందించలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మందికి ఈ పథకం ద్వారా చెక్కులను అందజేశామన్నారు. ఎవరికైనా ఇబ్బందులుంటే తమ కార్యాలయంలో సంప్రదిస్తే సాయం అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్, నరసింహులు, వేముల సునీల్, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, ఆరికట్ల మస్తాన్ నాయుడు, మట్టం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ పాలకమండలి సభ్యురాలిగా భూలక్ష్మి



ప్రమాణస్వీకారం చేస్తున్న భూలక్ష్మి

నాయుడుపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కనక దుర్గమ్మ ఆలయ పాలక మండలి సభ్యురాలిగా నాయుడుపేట పట్టణం బిరదవాడకు చెందిన పనబాక భూలక్ష్మి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలిగా పనిచేస్తున్న పనబాక భూలక్ష్మికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

బాలసదన్ విద్యార్థినులకు బ్యాగుల పంపిణీ

కోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం చెంబడిపాళెం గ్రామానికి చెందిన సూళ్లూరు చిరంజీవి వర్ధంతి సందర్భంగా ఆయన బంధువులు పురిణి నాగభూషణం, పురిణి శ్రీనివాసులు కోటలోని బాలసదన్ విద్యార్థినులకు బ్యాగులు, పండ్లు ఎస్‌ఐ పవన్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది అనురాధ, జయలక్ష్మి, నాగమణి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో బాలికల దినోత్సవం

సూళ్లూరుపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్లమిట్ట ఎర్రబాలెం అంగన్వాడీ కేంద్రంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. సీడీపీవో జ్యోతి కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలికలను బాలురలతో సమానంగా గౌరవించాలన్నారు. బాలికలు నలుగురిలో ఉన్నప్పుడు ఎలా మాట్లాడాలి అనే అంశంపై చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, అంగన్వాడీ సిబ్బంది సురేఖ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టేడులో...

కోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరిగింది. బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, కౌమార దశలో వచ్చే లక్షణాల గురించి అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత మాట్లాడుతూ బాలికలను చదువుల్లో ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు బాలికల అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.


వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు



కోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, శ్రీలక్ష్మమ్మకాలనీ, గోవిందపల్లి గ్రామాల్లో ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి విగ్రహాలకు అభిషేకాలు చేసి విశేష అలం కారంలో ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలోని ఆలయ ప్రధానార్చకుడు సాయిబాబా ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం జరిగింది.

నాయుడుపేట: విన్నమాల గ్రామంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదం అందజేశారు. స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో పూజారి విజయ కుమార్ స్వామి, అత్తికాయల సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, బాలకృష్ణ, సుకన్య, పుల్లయ్య, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

గోవిందుడికి లక్ష్మీనరసింహస్వామి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మద్వేంకట రామమూర్తి స్వామి ఆలయంలో పెరటాసి మాసం నాలుగో శనివారం సందర్భంగా వెంకటేశ్వర స్వామికి లక్ష్మీనరసింహస్వామి అవతార అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృత, క్షీర, చందనంతో అభిషేకం చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకీసేవ జరిపి ఆలయ ఆవరణలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు.

రైలు కిందపడి మహిళ మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం ఎన్ఎస్ఆర్ కాలనీ సమీపంలో రైలు కిందపడి మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన మస్తానమ్మ(55)కు గత కొంతకాలంగా మతిస్థిమితం లేదు. శనివారం ఉదయం ఎన్ఎస్ఆర్ కాలనీ సమీపంలో రైలు కిందపడి మృతి చెందింది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన బాలిక అప్పగింత

డక్కిలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం అదృశ్యం అయిన బాలికను శనివారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో గొడవపడి బాలిక ఇంటి నుంచి పారిపోయినట్లు తల్లిదుండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక ఆచూకీ కోసం గాలించడంతో రాపూరు మండలం పెంచకోన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉన్నట్లు సమాచారం అందింది. శనివారం ఆ బాలికను తీసుకువచ్చి తల్లిదుండ్రులు అప్పగించామని పోలీసులు చెప్పారు.

యువకుల ఘర్షణ

డక్కిలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామంలో శనివారం ఇద్దరు యువకుల మధ్య వ్యక్తిగత కారణాల వల్ల చోటు చేసుకొన్న వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. పోలీసులు కథనం మేరకు... గ్రామానికి చెందిన మునికుమర్, శ్రీనివాసులు మధ్య గత వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఒకరిపై ఒకరు కర్రలతోదాడి చేసుకోవడంతో ఇద్దరికీ రక్తగాయాలయ్యాయి. వారిద్దరినీ వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

గూడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం జరిగిందని, నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం శ్రామికనగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రామిక నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్, వివిధశాఖల అధికారులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వీవోఏల కాలపరిమితి రద్దుపై హర్షం

పెళ్లకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమాఖ్య సంఘాల్లో పనిచేస్తున్న వీవోఏ మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేయడం పట్ల వీవోఏలు హర్షం చేశారు. శనివారం వీవోఏలు చంద్రసేన, సుబాషిణి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వీవోఏల కాల పరిమితిని మూడేళ్లకే పరిమితం చేసిందన్నారు. ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించు కోవాలని పోరాటాలు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వం తీసుకొచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు చంద్రసేన, సుభాషిణి, వజ్రమ్మ, సుబ్బలక్ష్మి, ముత్యాలమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ ఉప కాలువపై రోడ్డు ఏర్పాటు



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట సుందరయ్య కాలనీ నుంచి సూళ్లూరుపేట రోడ్డు మీదుగా మతకముడి గ్రామానికి వెళ్లే తెలుగుగంగ ఉప కాలువ మీద రోడ్డు నిర్మాణ పనులను తెలుగుంగ అధికారులు చేపట్టారు. రెండు కిలోమీటర్ల ఈ రోడ్డుకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ రోడ్డు రైతులు పొలాలకు పోవడానికే గాక మూడు గ్రామాల ప్రజల రాకపోకలకు ఉపయోగ పడుతుంది.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పెళ్లకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నాగరాజు హెచ్చరించారు. శనివారం ఆయన మీడియా మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా.. రోడ్లపై వీరంగం చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం మత్తులో యువత చేస్తున్న తప్పుల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి... జీవితాంతం అంగవైకల్యంతో బాధపడుతున్న వారు కొందరైతే... ప్రాణాలు కోల్పోయి మరికొందరు కుటుంబసభ్యలు అనాథలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ మండల పరిధిలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలను తనిఖీ చేపడుతున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు.

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న మల్లికార్జునరావు దంపతులు

సూళ్లూరుపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల స్వామి ఆలయం వద్ద నూతనంగా శివాలయం నిర్మించనున్నారు. ఇందుకోసం ఆలయ వ్యవస్థాపకులు కారంశెట్టి మల్లికార్జునరావు, సుమతి దంపతులు శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం శనివారం అందజేశారు. కార్యక్రమంలో వాసు పాల్గొన్నారు.

పరిశమల్లో అగ్నిప్రమాదాలపై అనుమానాలు : సీపీఎం



సీఎంఆర్ అల్యూమినియం ఫ్యాక్టరీని సందర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఏర్పేడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో 20 రోజుల వ్యవధిలో రెండు ప్రముఖ కంపెనీల్లో భారీ అగ్ని ప్రమాదాలు సంభవించడం పలు అనుమానాలకు తావిస్తోం దని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఏర్పేడు మండలంలోని చింతలపాళెం వద్ద ఉన్న సీఎంఆర్ఎకో అల్యూమినియం కంపెనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని సీపీఎం నాయకులు శనివారం పరిశీలించారు. కార్మికులను అడిగి అగ్నిప్రమాదం జరిగిన తీరుపై అడిగి తెలుసు కున్నారు. ఏర్పేడు సీఐటీయూ అధ్యక్షులు షేక్ కరీముల్లా మాట్లాడుతూ తరచూ పరిశ్రమల్లో అగ్ని ప్రమా దాలు జరగకుండా కార్మికులకు ఫైట్ ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఏర్పేడు మండల కార్యదర్శి రాంబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగయ్య, వెంకటాద్రి, రేణిగుంట సీపీఎం ఏరియా కార్యదర్శి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం



శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం వెలుగు చూసింది. శ్రీకాళహస్తి రామసేతు వంతెన సమీపంలోని స్వర్ణముఖి నదిలో శనివారం గుర్తుతెలియని యువకుడు మృతదేహం నీటిపై తేలియాడింది. స్థానికుల సమాచారంలో శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న నరసింహ

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ యువకుడు గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. శ్రీకాళహస్తి పట్టణం తెట్టు ప్రాంతానికి చెందిన నరసింహ(30) ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఇటీవల కొద్ది నెలల క్రితం భార్యతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఆమె పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన అతడు శనివారం రాత్రి ఇంటి వద్ద కత్తితో గొంతు కోసుకున్నాడు. కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రుయాకు రెఫర్ చేశారు.

ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఊరేగింపు

వరదయ్యపాళెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వరదయ్య పాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీలోని వడ్డి పాళెంలో కొలువైన ప్రసన్న వెఒంకటేశ్వరస్వామి ఆలయంలో పెరటాసి నెల పురస్కరించుకునిప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి పలురకాల అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి స్వామివారి గ్రామవీధుల్లో ఊరేగారు.

పల్లా శ్రీనివాసరావును కలిసిన గుత్తి త్యాగరాజు



వరదయ్యపాళెం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును దేవాంగ అభ్యుదయ సేవా సంఘం గుత్తి త్యాగరాజు మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాల యంలో శనివారం కలిశారు. దేవాంగుల అభివృద్ధి కోసం ప్రత్యే కార్పొ షన్‌ను ఏర్పాటు చేసి, దేవాంగులకు సము చిత స్థానం కల్పించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాల కూల్చివేత

రెవెన్యూ అధికారుల పేరుతో



నిర్మాణాలను ఎక్స్‌లేటర్‌తో కూల్చివేస్తున్న దృశ్యం

రేణిగుంట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులమంటూ కొందరు ఎక్స్‌కవేటర్ సాయంతో రాత్రికి రాత్రే కూల్చివేశారు. జీపాళెం పంచాయతీ కురకాల్వ గ్రామ లెక్క దాఖలా సర్వేనంబరు 212లో ఉన్న పశువుల మేత భూమిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని గదులు నిర్మించి అమ్మకానికి పెట్టారు. ఈ విషయం అప్పట్లో పెద్దయెత్తున దుమారం రేపింది. దీనికితోడు ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. ఇటీవల ఇదే స్థలంలో మళ్లీ గదులు నిర్మించడంతో తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ఈ భూములపై హైకోర్టులో వ్యాజ్యం ఉండంతో సంబంధిత స్థలంలోకి ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్థానిక కృష్ణయ్య కాల్వ గ్రామస్తులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసి ఉండగా శుక్రవారం రాత్రికి రాత్రే నిర్మించిన గదులను రెవెన్యూ అధికారులమంటూ ఎక్స్‌కవేటర్ సాయంతో కొందరు కూల్చి వేశారు. ఈ విషయమై భూయజమాని గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నిర్మాణాల కూల్చివేతపై ఆర్‌ఐ జయకృష్ణను వివరణ కోరగా రెవెన్యూ తరఫున తాము ఎటువంటి నిర్మాణాలను కూల్చివేయలేదని స్పష్టం చేశారు.

బాధితురాలి ఇంటి వద్దకే సీఎం సహాయనిధి


ఆదిలక్ష్మికి చెక్కు అందజేస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యో): తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెం గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అనారోగ్య కారణంతో ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి ఆమెకు రూ.2,03,63లు సీఎం సహాయ నిధి మంజూరుకు కృషిచేశారు. శనివారం ఎమ్మెల్యే తల్లి బృందమ్మ బాధితురాలి ఇంటికెళ్లి చెక్కును అందించారు. దీంతో బాధితురాలు వారికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షులు రావిళ్ల మునిరాజనాయుడు, నాయకులు జయచంద్రనాయుడు, కమల్‌కుమార్, మల్లీశ్వరి, వెంకటరెడ్డి, మునిచంద్ర, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రమణయ్య



వెంకటరమణయ్యను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, అక్టో బరు 11 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ తిరుపతి జిల్లా అధ్య క్షులుగా శ్రీకాళ హస్తికి చెందిన బాలాజీ స్కూల్ కరస్పాండెంట్ వై.వెం కట రమణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ శని వారం ఉత్తర్వులు జారీచేశారు. నెల్లూరు జిల్లా గంగపట్నం చాముండేశ్వరి ఆలయ ఆవర ణంలో ముదిరాజ్ మహాసభ గౌరవ అధ్యక్షులు కోర్నా వెంకటనారాయణ ఆధ్వర్యంలో రమణయ్య నియామక పత్రాన్ని అందుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



రేణిగుంట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంజనేయ పురం అటవీ చెక్ పోస్టు సమీపంలో రోడ్డుపక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండడాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతుని వయస్సు 55 సంవత్సరాలు ఉంటుంది. ఎత్తు 5.6 అడుగులు ఉండగా నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడు. అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనవిడుదల చేసింది.

శనీశ్వరుడికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన శనీశ్వర స్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామివారికి తైలాభిషేకం చేశారు. పలుపుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

యోగా పోటీల్లో సుజాతకు రజతం



శ్రీకాళహస్తి, అక్టోబరు 11 (ఆంధ్ర జ్యోతి): విజయవాడలో యోగాసన భారత్ ఆధ్వర్యంలో సీనియర్ -సి, జూనియర్ జాతీయ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ట్విస్టింగ్ బాడీ మహిళల విభాగంలో శ్రీకాళహస్తికి చెందిన అయిలం సుజాత రజత పతకం సాధించింది.

భారత్‌గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేసుకోవాలి

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): భారత్ గ్యాస్ వినియోగదారులు ఈనెల 31 లోపు ఈకేవైసీ చేసుకోవాలని మోడ్రన్ గ్యాస్ ఏజెన్సీస్ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చేసుకోకపోతే గ్యాస్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలియజేశారు.

నీటికొరతతో భక్తుల ఇక్కట్లు


మూసిన మరుగుదొడ్లు, ఇన్‌సెట్లో వేసేసిన గేటు

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన భక్తులు స్నానమాచరించేందుకు నీరు లేకపోవడంతో ఇక్కట్లు పడ్డారని హిందూ ధార్మికమండలి శ్రీకాళహస్తి కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు అన్నారు. ఆయన మాట్లాడుతూ రెండవ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశార న్నారు. ఆలయ సమీపంలోని జలవినాయకుని వద్ద ఏర్పాటు చేసిన స్నానపు గదుల్లో, స్నానపు ఘట్టాల్లో నీరు రాకపోవడంతో ఇక్కట్లు పడ్డారన్నారు. అధికారులు స్పందించి స్నానపు ఘట్టాలు, స్నానపు గదుల వద్ద నీటి సమస్య రాకుండా చూడాలని కోరారు.

సత్యవేడు సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే ఆదిమూలం


టీటీడీ కల్యాణ మండపం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సత్యవేడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. సత్యవేడులో నూతనంగా నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ భవనం, టీటీడీ కల్యాణ మండపం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాసుకుప్పం బైపాస్ రోడ్డు, టీపీకోట రోడ్డుతో పాటు పెండింగ్‌లో ఉన్న పలు వంతెనలు, ఆరణియార్, కాళంగి ప్రాజెక్టుల ఆధునీకీకరణ, పర్యాటక అభివృద్ధి పనుల కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. నిర్మాణంలో ఉన్న అరణి యార్ వ్యూ టవర్, టీటీడీ కల్యాణ మండపం, అన్న క్యాంటీన్, ద్వారకా నగర్ వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నేతలు వెంకటరమణ, అడ్వొకేట్ రాజా నాయకులు ఇళంగోవన్ రెడ్డి, పద్దురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సమాజం

రేణిగుంట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాస్ కేవీకేలో ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతపై రైతులకు శనివారం అవగాహన సదస్సు జరిగింది. చైతన్య పురంలోని రాస్ ప్రధాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహ వ్యవసాయ పరిశోధన సంచా లకులు డాక్టర్ సుమతి మాట్లాడుతూ వివిధ పంటల్లో నూతన వంగడాలు, మార్కెట్ సమాచార ఆధారిత వ్యవసాయం, కనీస మద్దతు ధరలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ రిజిస్ట్రార్ డాక్టర్ గిరిధర్ కృష్ణ మాట్లాడుతూ భూసార పరీక్ష, సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. అంతకు ముందు ప్రధాన మంత్రి ధన ధాన్య యోజన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు వీక్షించారు. ఈ కార్య క్రమంలో సహ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి, మనోహర్, ప్రకాష్, తులసీ, శాస్త్రవేత్తలు దివ్య, సుధాకర్, రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

వరదయ్యపాళెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా బత్తుల వల్లం చేరుకుని గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెరటాసి శనివారం వేడుకల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందు కున్నారు. అనంతరం అదే గ్రామంలో టీడీపీ కార్యకర్త జగదీష్ గృహ ప్రవేశానికి హాజరయ్యారు. అక్కడ నుంచి పాండూరుకు చేరుకుని కోదండ రామ స్వామి ఆలయంలో నిర్వహించిన పెరటాసి నెల నాల్గవ శనివారం పూజల్లో పాల్గొన్నారు. గ్రామంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న రిటైర్డ్ ఆర్అండ్‌బీ ఎస్‌ఈ పరంధామరెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయశంకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ప్రతాప్ రెడ్డి, మురళి నాయుడు, కోటేశ్వరరావు, సురేష్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ సెంటర్ ప్రారంభం


న్యూట్రిషన్ ఫుడ్ ఆవశ్యకతను వివరిస్తున్న సెల్వరాజ్

పిచ్చాటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు, కేవీబీ పురం మండలంలో ఎంపిక చేసిన ఎస్టీ గ్రామాల్లో గిరిజన పేద, అనాథ పిల్లల విద్యాభివృద్ధికి స్మైల్ చిల్డ్రన్ ఇన్ క్రైసిస్ సంస్థ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకుడు ఏ.సెల్వరాజ్‌గురు తెలిపారు. మండ లాల్లో టీకే పురం ఎస్టీ కాలనీలో శనివారం జాయ్ కళంజిఎం న్యూట్రిషన్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ నిర్వాహకులు ఏ.సెల్వరాజ్ మాట్లాడుతూ కళంజిఎం న్యూట్రిషన్ సెంటర్ ద్వారా స్మైల్ చిల్డ్రన్ ఇన్ క్రైసిస్ సంస్థ వెనుకబడిన వర్గాల పిల్లలకు పోషకాహారం, విద్యా సౌకర్యాలు, మానసిక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. సేవాభావం కలిగిన వారు పిల్లల భవిష్యత్ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టు డైరెక్టర్ జాయ్ ఎప్సిపా పాస్టర్ అన్బురాజ్, ఫాల్గుణ, టీచర్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజనపై అవగాహన

వరదయ్యపాళెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, వ్యవసాయ రంగాన్ని సాంకేతికంగా బలోపేతం చేయడం ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) ప్రధాన లక్ష్యమని కడూరు పీఏసీఎస్ చైర్మన్ నందకిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం లో రైతులకు పీఎండీడీకేవై పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు, పంటబీమా, విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని తెలిపారు. పీఏసీఎస్ సీఈవో సంపత్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణ ప్రారంభం


మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేస్తున్నవైసీపీ నేతలు

కేవీబీపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురంలో శనివారం వైసీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతి రేకంగా వైసీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేసింది. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విచ్చేసి కోటి సంతకాల కార్య క్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఎంపీటీసీ అయ్యప్ప, వైస్‌ఎంపీపీ శ్రీనివాసులు, వైసీపీ నాయకులు నందకుమార్, లాలు బాబుయాదవ్, మాధవిరెడ్డి, గిరిబాబు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో బాంబే హైకోర్టు జడ్జి



శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అద్వైత్ ఎం స్నేతా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పూరిల్లు దగ్ధం



కేవీబీపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మ కండ్రిగ గ్రామంలో విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు.. కుటుంబ యజమాని సుబ్బరాయులు తన భార్య శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి వీచిన గాలులకు విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ ఇంటిపై పడ్డాయి. అప్రమత్తమైన సుబ్బ రాయులు, భార్య ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ఇంట్లో ఉన్న బీరువా, టీవీ, గృహ సామగ్రి, రెండు మూటల సజ్జలు కాలిపోయాయి. చుట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపుచేశారు. తమ కటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం వస్తుందని సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ బాలురు, ఎస్సీ బాలికల వసతి గృహాలలోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు శనివారం నిర్వహించారు. వంట గదిని, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు.

ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు


కోటి సంతకాల కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, మండల కన్వీనర్ మణినాయుడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. అనంతరం వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్, నాయకులు బీరేంద్రవర్మ, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, సాయినాయుడు, ప్రసాద్‌పాల్, అజయ్ కుమార్‌రెడ్డి, గురవయ్య, కిరణ్, జయంద్రనాయుడు, కోటీశ్వరరావు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో చేనేత జౌళిశాఖ కార్యదర్శి


ఆలయం వద్ద ఎం.బీనా

శ్రీకాళహస్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం అఖిల భారత చేనేత జౌళి శాఖ కార్యదర్శి ఎం.బీనా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, కళాసృష్టి స్వచ్ఛంద సేవాసంస్థ కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కాగా కలంకారీ క్రాఫ్ట్‌ను హ్యాండ్లూమ్‌లో చేర్చాలని దశరథాచారి కోరారు. అదేవిధంగా హ్యాండ్లూమ్ కళాకారులకు అత్యధిక మెగా క్లస్టర్లను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. ఆమె స్పందిస్తూ కలెక్టర్‌ద్వారా లేఖ అందజేస్తే కావాల్సి హ్యాండ్లూమ్ క్లస్టర్లను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, టీడీపీ నాయకులు లక్ష్మనేని మధుబాబు, లెనిన్ బాబు, వజ్రం కిషోర్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.